# తెలంగాణ చీరలకు ప్రపంచ ఖ్యాతి

- దేశ సంస్కృతిలో చేనేత ఓ భాగం
- ఫ్యాషన్ డిజైనింగ్‌లో పోచంపల్లి
- కార్మికుల కృషి ప్రశంసనీయం
- చేనేత కార్మికుల సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కితాబు




డబుల్ ఇక్కత్‌లో పది వేల రంగుల మిళితంతో భారత దేశ చిత్రం, రాట్నం వచ్చేలా బోగ సరస్వతి-బాలయ్య రూపొందించిన వస్త్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. చిత్రంలో మంత్రులు తుమ్మల, సీతక్క

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో నేసిన చీరలు ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచినట్టు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. పోచంపల్లి, వరంగల్, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట వస్త్రాలకు ఒక ప్రత్యేకత ఉన్నదని, వీటికి జీఐ ట్యాగ్ రావడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రపతి బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో జరిగిన చేనేత కార్మికుల సమావేశానికి హాజరయ్యారు. తొలుత పోచంపల్లిలోని శ్రీరంజన్ సిల్క్ ఇండస్ట్రీ ప్రొడక్షన్ కంట్రోల్ యూనిట్స్‌ను సందర్శించారు.. అనంతరం తెలంగాణ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన పెవిలియన్ థీమ్‌ను సందర్శించి నూలు నుంచి వస్త్ర ఉత్పత్తి పరిణామ క్రమాన్ని తెలియజేసే చేనేత స్టాళ్లను పరిశీలించారు. అక్కడ వినోబా బావే ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడారు. చేనేత రంగంలో జరుగుతున్న కృషి గొప్పదని, చేనేత కళను వారసత్వంగా మరొకరికి అందించడం అభినందనీయమని అన్నారు. యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ (యూఎన్ డబ్ల్యూటీవో) ప్రపంచ పర్యాటక రంగంలో 2021లో పోచంపల్లి ప్రాంతాన్ని పర్యాటక గ్రామంగా ప్రకటించడాన్ని రాష్ట్రపతి స్వాగతించారు. తన ప్రాంతం నుంచి కొంత మందిని ఇక్కడికి తీసుకొచ్చి చేనేత రంగం పనితీరును పరిశీలిస్తామని తెలిపారు. భూదాన్ పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ వెంకటగిరి తరహాలో ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

### రాష్ట్రపతి పర్యటనలో స్వల్ప అపశ్రుతి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకున్నది. ఆమె ప్రయాణిస్తున్న ఆర్మీ హెలిక్యాప్టర్ భూదాన్ పోచంపల్లిలో ల్యాండ్ అవుతున్న సమయంలో అక్కడున్న పోలీసులు గాలికి ఎగిరిపడ్డారు. ఈ ఘటనలో ఉప్పల్ ఏసీపీ శ్రీనివాస్‌కు చేయి విరిగింది. ఆయన్ను చికిత్స నిమిత్తం వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. ఆయనతోపాటు అక్కడే ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా రాచకొండ డీసీపీ రాజేశ్‌చంద్ర స్పందిస్తూ.. ఇది అపశ్రుతి కాదని, ఉప్పల్ ఏసీపీ శ్రీనివాస్ స్వల్ప అస్వస్థత కారణంగా కండ్లు తిరిగి కింద పడిపోయారని తెలిపారు.

## సిరిసంపదలతో సుభిక్షంగా తెలంగాణ

**ఎంఎన్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్రపతి**

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): విశిష్టమైన సాంస్కృతిక వారసత్వ మూలాలు, పుష్కలమైన విద్యా, ఉద్యోగ వనరులు కలిగిన రాష్ట్రంగా సిరిసంపదలతో సుభిక్షంగా ఉన్న ఈ తెలంగాణ నిజమైన కోటి రతనాల వీణ అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కొనియాడారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎంఎన్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ఆమె మాట్లాడారు. ఐటీ కేంద్రంగా ఉన్న హైదరాబాద్, నిష్ణాతులైన ఐటీ మానవ వనరులతో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని, ఇక్కడి ఐటీ నిపుణులకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఉన్నదని అన్నారు.

## అసెంబ్లీ, మండలి ఒకేచోట ఉంటే ప్రయోజనం

- పాత అసెంబ్లీ హాలులోకి మండలి మార్పు
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): శాసనసభ, శాసనమండలి ఒకే చోట ఉంటే అందరికీ ప్రయోజనకరమని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. బుధవారం తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని కమిటీ హాల్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులతో గుత్తా, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ.. పార్లమెంట్ మాదిరిగానే అసెంబ్లీ, శాసనమండలి రెండు కూడా ఒకేచోట ఉండాలని ప్రభుత్వం యోచించడం శుభపరిణామమని చెప్పారు. రెండు సమావేశ మందిరాలు ఒకేచోట ఉంటే శాసనమండలి, శాసనసభ సభ్యులకు, మంత్రులకు, అధికారులకు అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు మండలిని పాత అసెంబ్లీ హాలులోకి మార్చాలని సూచించారు. ఆర్‌అండ్‌బీతోపాటు అన్ని శాఖల అధికారులు మండలి మార్పు పనులను వేగవంతంగా చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు. సమావేశంలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థికంపై ఇది శ్వేతపత్రం కాదు; ఎగవేత పత్రం

మొదటిపేజీ తరువాయి...

సరికాదని, 47 పేజీల పుస్తకాన్ని చదివేందుకు సమయం ఇవ్వాలని కోరారు. సభ్యుల కోరిక మేరకు అరగంట తేనీటి విరామం అనంతరం సభ ప్రారంభమైంది.

### వాదప్రతివాదాలు

తేనీటి విరామం అనంతరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో, గతపాలనపై బురద జల్లే ఉద్దేశంతో ప్రభుత్వం తప్పుల తడకగా శ్వేతపత్రాన్ని విడుదల చేసిందని ఆరోపించారు. ఆయన మాట్లాడుతున్న క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనేక పర్యాయాలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. రెండుసార్లు హరీశ్‌రావు మైక్ కట్ చేశారు. రెండు సందర్భాల్లో బీఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. సభను ఆర్డర్‌లో పెట్టిన అనంతరం తిరిగి స్పీకర్ హరీశ్‌రావుకు అవకాశం కల్పించారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, చేసిన అప్పుల నేపథ్యాన్ని హరీశ్‌రావు సాధారికారికంగా సభ ముందు ఉంచారు. ఆ తరువాత ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ శ్వేతపత్రంపై విరుచుకుపడ్డారు. అందులో పేర్కొన్న అంశాలన్నీ తప్పుల తడకగా ఉన్నాయని మండిపడ్డారు. గడచిన 57 ఏండ్ల బడ్జెట్ రూ.11 లక్షల కోట్లు అయితే తెలంగాణ పదేండ్లలో రూ.12 లక్షల కోట్లు అని ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రమే తేల్చి చెప్పిందని ఉదహరించారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీయకూడదని సూచించారు. తర్వాత బీజేపీ నుంచి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అలవి కాని హామీలు ఇచ్చి అప్పుల పేరుతో ఆరు గ్యారెంటీలను విస్మరించకూడదని హెచ్చరించారు. సీపీఐ సభాపక్ష నేత కూనంనేని సైతం తప్పులను మాత్రమే ఎత్తిచూపుతాం. కాంగ్రెస్ నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మదన్‌మోహన్ రావు మాట్లాడారు. తర్వాత భట్టి విక్రమార్క శ్వేతపత్రం విడుదల చేయటంలోని ఆంతర్యాన్ని బయటపెట్టారు. దీనికి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద, కౌశిక్‌రెడ్డి సహా పలువురు తీవ్రంగా ఆక్షేపించారు. క్లారిఫికేషన్ సమయంలోనూ బీఆర్‌ఎస్ సభ్యులు సర్కారును ఇరుకునపెట్టారు. మొత్తంగా బుధవారం అసెంబ్లీ సమావేశం ఆర్థిక శ్వేతపత్రంతో అధికార కాంగ్రెస్ పార్టీ 'హస్త'కుతలమైంది. సభ గురువారం ఉదయం 11 గంటలకు వాయిదాపడింది.

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మానవత్వం

- స్పృహతప్పి పడిపోయిన అసెంబ్లీ ఉద్యోగికిసపర్యలు



హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మానవత్వం చాటుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఎడమ వైపున కూర్చున్న ముగ్గురు సిబ్బందిలో ఒకరు స్పృహతప్పి పడిపోయారు. గమనించిన ఓ మహిళా ఉద్యోగి వైద్యుడి కోసం బయటికి వెళ్తున్న క్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ గమనించి డాక్టర్ సంజయ్‌కు విషయం చెప్పారు. ఆయన వెంటనే అతని వద్దకు వెళ్లి చేయి పట్టుకొని పల్స్ చెక్ చేశారు. అతని భుజంతట్టి ధైర్యం చెప్పారు. నీళ్లు తాపించారు. అతడు కుదుటపడిన తర్వాత తన సీట్‌లోకి వెళ్లారు.

## అప్పులే కాదు.. ఆస్తుల సంగతి చెప్పు

- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎంపీ వినోద్ హితవు
- కరీంనగర్ మీడియా సమావేశంలో మండిపాటు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'ఎన్నికల్లో ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయకుండా.. అప్పుల పేరుతో గత కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది' అని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులే కాదు.. ఆయన సృష్టించిన ఆస్తుల వివరాలు కూడా ప్రజలకు వివరించాలని హితవుపలికారు. బుధవారం కరీంనగర్ ప్రతిమ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో 2001 నుంచి 2014 వరకు రాజీలేని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతోపాటు తెచ్చుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. విద్యుత్తు మెరుగుదల కోసం వెచ్చించిన అప్పులే తమకు కనిపిస్తున్నాయి కానీ.. 93 వేల కోట్లకు పెరిగిన ఆస్తులు కనిపించడం లేదా? ఆ విషయాలను ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో నాడు కేవలం ఐదు మెడికల్ కళాశాలలు ఉంటే.. నేడు 33 జిల్లాల్లో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని ఉద్ఘాటించారు. రూ.617 కోట్లతో సచివాలయం నిర్మిస్తే, దానికి వేల కోట్లు పెట్టామని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు గుర్తించాలని, అప్పులంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అబద్ధాలను నమ్మకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం వంద రోజుల తదుపరి నిలదీయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఐఎంఎల్పీ లీడర్‌గా అక్బరుద్దీన్

**సీపీఐ పక్షనేతగా కూనంనేని**





హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఎంఐఎం పార్టీ శాసనసభాపక్షనేతగా ఆ పార్టీ సీనియర్ నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ శాసనసభాపక్షనేతగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికయ్యారు. వీరిద్దరిని శాసనసభాపక్ష నేతలుగా (ఫ్లోర్‌లీడర్లు) గుర్తిస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం అసెంబ్లీలో ప్రకటించారు. ఎంఐఎం ప్రధాన కార్యదర్శి అందించిన సమాచారం మేరకు అక్బరుద్దీన్‌ను, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అందించిన సమాచారం మేరకు కూనంనేనిని ఎల్పీ లీడర్లుగా గుర్తిస్తున్నట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ ఎల్పీ నేతగా కేసీఆర్ ఇప్పటికే వ్యవహరిస్తున్నారు. అక్బరుద్దీన్ 2004 నుంచి ఎంఐఎం ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. బీజేపీకి సభలో 8 మంది సభ్యులుండగా, ఆ పార్టీ ఇంతవరకు ఎల్పీ లీడర్‌ను ఎన్నుకోలేదు.

### సభలో రన్నింగ్ కామెంటరీలొద్దు: స్పీకర్



హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో సభ్యులు మాట్లాడుతున్నప్పుడు ఆటంకం కలిగించొద్దని, రన్నింగ్ కామెంటరీలు చేయెద్దని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభ్యులకు సూచించారు. చర్చలు జరుగుతున్నప్పుడు వ్యాఖ్యానాలు చేయవద్దని కోరారు. ప్రస్తుత సభలో విశేషమైన అనుభవం ఉన్నవారితోపాటు 57 మంది కొత్త సభ్యులు ఉన్నారని తెలిపారు. పాత, కొత్త సభ్యులు చర్చలను సావధానంగా ఆలకిస్తే అర్థవంతమైన చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. అనుభవజ్ఞుల ప్రసంగాలు కొత్తవారు పరిణతి సాధించేందుకు దోహదపడతాయని తెలిపారు. సభాపతికి సహకరించి సభ హుందాతనాన్ని, గౌరవాన్ని రక్షించాలని కోరారు.

### క్లారిఫికేషన్స్‌కు అవకాశమివ్వకుంటే తప్పుడు సంకేతాలు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో చర్చల సందర్భంగా విపక్ష సభ్యులు అడిగినవాటికి క్లారిఫికేషన్స్‌కు అవకాశమివ్వకపోతే తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశముందని మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. సభలో నిర్మాణాత్మక చర్చలు జరిపి ప్రజలకు మంచి సంకేతాలు పంపించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ట్రెజరీ బెంచీ నుంచి రెచ్చగొట్టడం వల్లే రన్నింగ్ కామెంటరీలకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

## 'తెల్ల'బోయిన శ్వేతపత్రం!

- తప్పుల తడకగా.. కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కలు
- తప్పులను ఎత్తిచూపిన.. హరీశ్‌రావు, అక్బరుద్దీన్
- అసెంబ్లీలో అధికార పక్షాన్ని ఎండగట్టిన విపక్షం

*హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): శ్వేతపత్రం విడుదల చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తల్లకిందులుగా చూపి.. ప్రజలను తప్పుదోవ పట్టించాలనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ వ్యూహం బెడిసికొట్టింది. శ్వేతపత్రంలో పేర్కొన్న అంకెల్లో తప్పులను బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. శ్వేతపత్రంలో చూపెట్టిన అంకెలకు.. కాగ్ విడుదల చేసిన నివేదికల్లోని అంకెలకు మధ్య పొంతన కుదరకపోవడాన్ని సూటిగా ప్రశ్నించడంతో.. సీఎం రేవంత్‌తోపాటు, మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు సమాధానం చెప్పలేక రాజకీయ విమర్శలకు దిగారు.*

### అధికారపక్షం అనుభవలేమి

*ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ ఏర్పాటు వరకు ఆర్థిక అంశాలపై పరస్పర విభిన్నమైన అంకెలను ప్రదర్శించిన ప్రభుత్వ పక్షం.. వాటిని గట్టిగా సమర్థించుకోవడంలో విఫలమైంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు నాటికి అనేక కమిటీల నివేదికలను ఔపోసన పట్టిన హరీశ్‌రావు స్పష్టంగా, సూటిగా నివేదికల్లోని అంశాలను బయటపెట్టడంతో.. కాంగ్రెస్ నేతలు తెల్లమొహాలేయడం తప్పితే.. తడుముకోకుండా సమాధానాలు మాత్రం చెప్పలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేల అనుభవలేమి కొట్టొచ్చినట్టు కనిపించింది. ఇటు అంకెల్లో.. అటు విమర్శలు చేయడంలో.. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో అధికారపక్షం బుధవారంనాడు పూర్తిగా వెనుకబడింది. ప్రతిపక్షాల నుంచి అంత స్పష్టంగా.. గణాంకాలతోసహా ప్రశ్నలు సంధిస్తారని బహుశా ఊహించలేకపోయినవారు ఒక్కో ప్రశ్నకు సమాధానం కోసం వెతుక్కునే క్రమంలో.. రాజకీయ విమర్శలకు దిగారు.*

### తడబడిన మొదటి అడుగు

*కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత.. అసెంబ్లీ కార్యకలాపాలలో శ్వేతపత్రం విడుదల చేయడమే ఇప్పటివరకు అతిపెద్ద సంఘటన. అసెంబ్లీలో ఆధిపత్యం ప్రదర్శించడానికి ప్రభుత్వం వేసిన మొదటి అడుగే తడబడింది. అంకెల్లో తేడాలను వివరించడంలో.. ఇటు ప్రతిపక్షాల నుంచి వచ్చే ప్రశ్నలకు సహేతుకంగా సమాధానాలు చెప్పకపోవడంతో శ్వేతపత్రం 'తెల్ల'బోయినట్టయ్యింది..!*

# రుణం కాదు.. సుజలం!

- గత తొమ్మిదిన్నరేండ్లలో జలమండలి తెచ్చిన అప్పు 1,900 కోట్లే
- ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు తెచ్చిన అప్పులు 3,264 కోట్లు
- 12 శివారు మున్సిపాలిటీల గొంతు తడిపిన కేసీఆర్ ప్రభుత్వం
- తెలంగాణ ఏర్పడ్డాక తీర్చిన 'ఉమ్మడి' అప్పు రూ.912 కోట్లు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాగునీటి కోసం తెలంగాణ ప్రజలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని శివారు మున్సిపాలిటీలకు 15 రోజులకోసారి కూడా మంచి నీళ్లు రాకపోయేవి. భూగర్భజలాలు లేక, నల్లా నీరు రాక కుత్బుల్లాపూర్ లాంటి ప్రాంతాల్లో జనం కలుషిత నీటినే తాగాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే కాకుండా అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) వరకు ఉన్న అన్ని ప్రాంతాలకూ రోజు విడిచి రోజు సమృద్ధిగా తాగునీరు అందుతున్నది.

ఇదంతా రాత్రికి రాత్రి జరిగిన మార్పు కాదు. కేసీఆర్ ప్రభుత్వం పట్టుదలతో నదీజలాలను తీసుకొచ్చి, విస్తృతమైన పైపులైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చింది. గతంలో పేరుకు మాత్రమే విశ్వనగరంగా ఉన్న హైదరాబాద్‌ను దేశంలోని ఏ ఇతర మెట్రో నగరానికీ తీసిపోని విధంగా తీర్చిదిద్దింది. అందుకోసం ప్రభుత్వ పూచీకత్తుతో హడ్కో నుంచి జలమండలికి రూ.1,900 కోట్ల రుణాన్ని ఇప్పించింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తాజాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలోని అప్పుల్లో ఇదీ ఒక భాగమే. అంతేకాకుండా జలమండలి ద్వారా చూపిన అప్పుల్లో దీనితోపాటు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు సైతం శ్వేతపత్రంలో ఉండటం గమనార్హం. అయినప్పటికీ ఇవన్నీ కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులేనని, అవి తెలంగాణకు గుదిబండగా మారాయని ప్రజలను మభ్యపెట్టేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నించింది. వాస్తవంగా చూస్తే జలమండలి ద్వారా చేసినది అప్పు కాదని, ప్రజలకు అందించిన సుజలమని స్పష్టమవుతున్నది.

కేసీఆర్ ప్రభుత్వ పూచీకత్తుతో జలమండలి రూ.5,164 కోట్ల అప్పు తీసుకున్నట్టు శ్వేతపత్రంలో పేర్కొన్న రేవంత్ సర్కారు.. ఇందులో ఈ నెల ఒకటో తేదీ నాటికి ఇంకా రూ.2,352 కోట్ల అప్పు ఉన్నట్టు చూపింది. కానీ, గత తొమ్మిదిన్నరేండ్లలో జలమండలి కేసీఆర్ ప్రభుత్వ పూచీకత్తుతో తీసుకున్న రుణం రూ.1,900 కోట్లు మాత్రమే. ఉమ్మడి రాష్ట్రంలో ఏ ప్రభుత్వమూ జలమండలిని పట్టించుకున్న దాఖలాలే లేవు. దీంతో ఆ సంస్థ ఏటా అప్పుల్లో కూరుకుపోయేది. కానీ, తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఏటా జలమండలికి పుష్కలంగా బడ్జెట్ కేటాయింపులు జరిపింది. గత తొమ్మిదిన్నరేండ్లలో జలమండలి దాదాపు రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ అందులో రుణంగా తీసుకున్నది రూ.1900 కోట్లే. మిగిలిన మొత్తాన్ని కేసీఆర్ ప్రభుత్వమే బడ్జెట్ కేటాయింపుల ద్వారా సమకూర్చింది. దీనితో పాటు గత మూడేండ్ల నుంచి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నిరుపేద కుటుంబాలకు నెలకు 20 వేల లీటర్ల చొప్పున ఉచితంగా మంచినీరు సరఫరా చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఏటా రూ.300 కోట్ల చొప్పున జలమండలికి అందించింది.

### 40 లక్షల మందికి సమృద్ధిగా తాగునీరు

తెలంగాణ ఏర్పడేనాటికి కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి తదితర శివారు ప్రాంతాల్లో 15 రోజులకోసారి కూడా తాగునీరు వచ్చేది కాదు. నగరం చుట్టూ ఉన్న 12 శివారు మున్సిపాలిటీలను 2009లోనే గ్రేటర్‌లో కలిపినప్పటికీ కనీసం మంచినీటి సదుపాయం కూడా కల్పించలేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హడ్కో ద్వారా రూ.1,900 కోట్ల రుణాన్ని తీసుకొని కృష్ణా, గోదావరి నుంచి వచ్చే జలాలను శివారు ప్రాంత ప్రజలకు అందించింది. ఇందుకోసం 12 మున్సిపాలిటీల పరిధిలో 56 రిజర్వాయర్లను నిర్మించారు. 1,800 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. తద్వారా 40 లక్షల మందికి తాగునీటిని అందించారు.

### రూ.3,264 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులే

శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం చూపిన రూ.5,164 కోట్లలో కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన రూ.1,900 కోట్లను మినహాయిస్తే మిగిలి రూ.3,264 కోట్లు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రుణాలే. కృష్ణా, గోదావరి నదుల నుంచి హైదరాబాద్‌కు తాగునీటిని అందించేందుకు చేపట్టిన పనుల కోసం అప్పటి ప్రభుత్వ పూచీకత్తుతో జలమండలి ఈ రుణాలను తీసుకున్నది. వీటికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జలమండలి రూ.912 కోట్లను వాయిదాల రూపంలో చెల్లించింది.

# హరీశ్‌రావు వర్సెస్ రాజగోపాల్ రెడ్డి

**మాటకు మాట**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటుచేసుకొన్నది. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ హరీశ్‌రావుకు మేనమామ సాలు వచ్చిందని, కానీ ఎన్నటికీ సీఎం కాలేరని, కేసీఆర్, కేటీఆర్ వాడుకుంటున్నారని వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. తమ నాయకుడు కేసీఆర్ చూపిన బాటలోనే బీఆర్‌ఎస్ నేతలందరూ నడుస్తారని, తామేమీ రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవిని కొనుక్కోలేదని విమర్శించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలతో కాంగ్రెస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటివరకు బయట ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సభ లోపలికి వచ్చి మరీ మాట్లాడారు. అది తాము ఎప్పుడో చేసిన వ్యాఖ్యలని, అదీగాక తమ పార్టీ అంతర్గత వ్యవహారమని, అధిష్ఠానం నిర్ణయం మేరకు నడుచుకుంటామని, ఆ వ్యాఖ్యలు పదే పదే అనడం తగదని హరీశ్‌రావుకు సూచించారు. హరీశ్‌రావు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. అయితే రాజగోపాల్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటేనే, తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటానని హరీశ్‌రావు స్పీకర్‌కు వెల్లడించారు. తుదకు మంత్రి శ్రీధర్‌బాబు సూచనల మేరకు హరీశ్‌రావు వ్యాఖ్యలను మాత్రమే స్పీకర్ సభ రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు.

### కడియం వర్సెస్ భట్టి

రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు హరీశ్‌రావు యత్నిస్తున్న క్రమంలో స్పీకర్ మైక్‌ను కట్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేకు అవకాశమిచ్చారు. దీంతో మైక్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ వెల్‌లోకి వెళ్లి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని హరీశ్‌రావుకు అవకాశమివ్వాలని స్పీకర్‌ను కోరారు. కానీ ఆ వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేచి దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. భట్టి అభ్యంతరంపై మాజీ మంత్రి కడియం శ్రీహరి ఆక్షేపించారు. స్పీకర్‌ను డిక్టేట్ చేయడమేమిటని నిలదీశారు. ఒకరు అవకాశమివ్వాలని చెప్తే, మరొకరు వద్దంటూ వారించడమేమిటని మండిపడ్డారు. ఆ తర్వాత హరీశ్‌రావుకు స్పీకర్ అవకాశమిచ్చారు.

### భట్టి సీఎం కాకపోయినా సీఎం భవన్ వచ్చింది

బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీఎం కాకపోయినా సీఎం భవనం మాత్రం వచ్చిందని అనగా సభలో నవ్వులు పూశాయి. మహేశ్వర్‌రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేస్తుండగా, స్పీకర్ పదే పదే వారించారు. దీంతో ఆయన.. తమది సభలో రెండో అతిపెద్ద ప్రతిపక్షపార్టీ అని, 8 మంది సభ్యులం ఉన్నామని చెప్పి, మరింత సమయం ఇవ్వాలని కోరారు.

### హామీలను ఎలా అమలు చేస్తారో చెప్పాలి: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వం విడుదల శ్వేతపత్రంపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సభలో మాట్లాడారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని కాంగ్రెస్ విడుదల చేసిన శ్వేతపత్రం విడుదల చేయడం బాగానే ఉన్నదని, అలా అని ఇచ్చిన హామీలకు ఎగనామం పెడితే ఊరుకోబోమని హెచ్చరించారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేయాలని, 412 హామీలను కూడా నెరవేర్చాలని, లేదంటే ప్రజల తరపున ప్రశ్నిస్తామని అన్నారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. హామీలను ఎలా నెరవేర్చుతుంది? అని ప్రశ్నించారు. నిధులను ఎలా సమకూర్చునున్నదనే విషయాన్నీ సభకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

## దవాఖాన ఊరి బయట ఉండాలె

- సెంట్రల్ జైలు సిటీ మధ్యలో ఉండాలి
- మోదీతో మనకెందుకు పంచాయితీ
- అసెంబ్లీలో మంత్రి కొండా ఆసక్తికర వ్యాఖ్యలు
- తిప్పికొట్టిన మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం అసెంబ్లీలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సెంట్రల్ జైలు సిటీ మధ్యలోనే ఉండాలని, దవాఖానను ఊరి బయటే ఉంటే బాగుంటుందని వ్యాఖ్యానించారు. అప్పులు తెచ్చి బిల్డింగులు కట్టామని చెబుతున్నారని, వరంగల్ నగరం మధ్యలో ఉన్న సెంట్రల్ జైలు కూలగొట్టి దవాఖాన కట్టారని, ఇది సరికాదని పేర్కొన్నారు. దవాఖాన సిటీ మధ్యలో కంటే ఊరి చివరి ఉంటేనే బాగుండేదని పేర్కొన్నారు. సచివాలయ పాత భవనాన్ని కూలగొట్టి మళ్లీ అక్కడే ఎందుకు కట్టారని ప్రశ్నించారు. ఇంకెక్కడైనా అయితే బాగుండేది కదా అని అభిప్రాయపడ్డారు. గతంలో కేసీఆర్ కుటుంబం, ఏపీ సీఎం జగన్ కుటుంబాలు రెండు కలిసి భోజనాలు చేశాయని, కానీ ఆ సమావేశంలో సీఎస్‌లు ఎందుకు ఉండరని నిలదీశారు. కేంద్రాన్ని బద్నాం చేస్తున్నారని, మోదీతో మనకు పంచాయితీ ఎందుకు? కలిసి ఉండొచ్చు కదా అంటూ చేసిన వ్యాఖ్యలు సభలో ఆసక్తి కలిగించాయి. సురేఖ వ్యాఖ్యలకు హరీశ్‌రావు అంతే ఘాటుగా స్పందించారు. ''దవాఖాన ఊరవతల ఉండాలట, జైలేమో ఊర్లో ఉండాలట, ఇదేంది అధ్యక్షా? ప్రజలు ఇబ్బందులు పడొద్దని వరంగల్ నడిబొడ్డున దవాఖాన ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందని ఆలోచించాం'' అని పేర్కొన్నారు.

## అప్పుడే చర్చించమంటే ఎలా?

- 42పేజీల పుస్తకం సభ్యుల చేతికి
- 4 నిమిషాలకే చర్చను ప్రారంభించమన్న స్పీకర్
- తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన హరీశ్‌రావు
- సభ్యుల కోరిక మేరకు సభ వాయిదా

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): లఘు చర్చ సందర్భంగా సభలో సభ్యులకు 42 పేజీల శ్వేతపత్రాన్ని ఇచ్చిన నాలుగు నిమిషాలకే చర్చను ప్రారంభించాలని స్పీకర్ కోరడాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆ పుస్తకాన్ని చదువుకునేందుకు సమయం ఇవ్వాలని సభ్యులు కోరడంతో టీ విరామం తర్వాత చర్చను కొనసాగించేందుకు స్పీకర్ సభను వాయిదా వేశారు. బుధవారం సభ ప్రారంభమయ్యాక సభ్యులందరికీ శ్వేతపత్రాన్ని అందజేసిన తర్వాత ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. తర్వాత చర్చను ప్రారంభించాలని కోరడంతో హరీశ్‌రావు పైవిధంగా స్పందించారు. సభ్యులకు ముందుగా నోట్ ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదని అసహనం వ్యక్తంచేశారు. భవిష్యత్తులోనైనా లఘు చర్చల నోట్‌లు ముందురోజే ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సమాధానం సంతృప్తి ఇవ్వకుంటే నిరసన చేయడం సభ్యుల హక్కని, ఆ అవకాశాన్ని కూడా స్పీకర్ ఇవ్వలేదని విమర్శించారు. ఎంఐఎంఎల్పీ నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఇచ్చిన గణాంకాల అధ్యయనానికి 40 నిమిషాల నుంచి గంటపాటు టీ విరామం ఇవ్వాలని కోరారు. సీపీఐఎల్పీ నేత కూనంనేని మాట్లాడుతూ.. ఆర్థికశాఖ మంత్రి ప్రసంగానంతరం గురువారం చర్చ జరపాలని కోరారు.

### గతంలో ఇలాంటి సంప్రదాయం లేదు

సభ్యుల సూచనలపై మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గతంలో ఇలాంటి సంప్రదాయాన్ని పాటించలేదని, లఘుచర్చల సమయంలో నోట్‌ను ముందుగా ఇచ్చిన దాఖలాలు గతంలో లేవని గుర్తు చేశారు. హరీశ్‌రావు అనుభవజ్ఞులు కనుక ఆయనకు విరామం అవసరం లేదని, అయినప్పటికీ సభ్యుల సూచన మేరకు స్పీకర్ అనుమతిస్తే టీ విరామం తర్వాత చర్చను కొనసాగిస్తామని చెప్పడంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను వాయిదా వేశారు. అంతకుముందు భట్టి మాట్లాడుతూ.. పవిత్రమైన అసెంబ్లీ ద్వారా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే శ్వేతపత్రాన్ని విడుదల చేసినట్టు చెప్పారు. దీనిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని సభ్యులను కోరారు.